సాక్షి ప్రకాశం

ఆదివారం । 5 । జనవరి । 2025



పెళ్లి వేడుకలకు వెళ్లొస్తూ..
పెళ్లి వేడుకలకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు మృతిచెందగా మరో 9 మందికి గాయాలైన ఘటన కంభం మండలం తురిమెళ్ల -యర్రబాలెం మధ్య జరిగింది. - 8లో..



బీమా పేరుతో టీడీపీ సభ్యత్వాలా?
గ్రామాల్లో టీడీపీ నాయకులు ఉపాధి, వెలుగు సిబ్బందిని అడ్డం పెట్టుకుని ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళల దగ్గర వంద రూపాయలు వసూలు చేసి టీడీపీ సభ్యత్వాలు కట్టిస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/21

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగ మంచు కురుస్తుంది. రాత్రికి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: బీసీలకు, అగ్రవర్ణ పేదలకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 17 నుంచి 19వ తేదీ వరకూ పరిశీలన ఉంటుందన్నారు. 20 నుంచి 24వ తేదీ వరకూ లబ్ధిదారులను మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాల్టీల పరిధిలో మున్సిపల్ అధికారులు ఎంపిక చేస్తారన్నారు. మొత్తం 1648 మందికి రూ.40.63 కోట్ల రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల వయస్సు 21 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. లబ్ధిదారులకు తెల్ల కార్డు, ఆధార్ కార్డు ఉండాలని చెప్పారు.

అంధుల సమస్యల పరిష్కారానికి కృషి

● జేసీ గోపాలకృష్ణ



లూయి బ్రెయిలీ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు వన్‌టౌన్: అంధుల సమస్యల పరిష్కారానికి అన్ని వేళల్లో అందుబాటులో ఉండి కృషిచేస్తానని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలను ఒంగోలు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు జీ అర్చన అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముందుగా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న లూయీ బ్రెయిలీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శుక్రవారం అంధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెప్మా, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి యం.అంజల, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే ఆదిలక్ష్మి, మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కే ధనలక్ష్మి, జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ, ఐసీడీఎస్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ రైతులకు పురస్కారాల ప్రదానం



అభ్యుదయ రైతు పురస్కారాలతో జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతులు

ఒంగోలు సిటీ: విజ్ఞాన్ యూనివర్సిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'అభ్యుదయ రైతుల పురస్కారాలు–2025' కార్యక్రమాన్ని శనివారం గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు రైతులకు అభ్యుదయ రైతు పురస్కారాలు అందజేశారు. కొత్తపట్నం మండలంలోని దద్దాల రామారావు, పులి ఆదిలక్ష్మి, గుత్తికొండ వెంకట ఝాన్సీలక్ష్మి, సంతనూతలపాడు మండలానికి చెందిన శేషమ్మ ఈ పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కె.అచ్చెంనాయుడు, నర్సరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడవల్లి వెంకటేశ్వరరావు శాలువా, మెమెంటోలతో వారిని ఘనంగా సన్మానించారు. ఈ అవకాశాన్ని కల్పించిన జిల్లా ప్రాజెక్టు మేనేజరు సుభాషిణికి రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మధ్యాహ్నం మంట!

బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అష్టకష్టాలు పడి కుకింగ్ ఏజెన్సీలు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నాయి. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి 31 పైసలు పెంచింది. ఆ మేరకు మెనూలో రూపాయి విలువైన కూర పెంచింది. ఇది నిర్వాహకులపై భారాన్ని మోపినట్లయింది. దీనికి తోడు గోరు చుట్టుమీద రోకలి పోటులా కార్మికులకు ఇచ్చే వేతనాలు, కుకింగ్ కాస్ట్ బకాయిలు చెల్లించే విషయంలో తాత్సారం చేస్తోంది. దీంతో నిర్వాహకులకు మధ్యాహ్న భోజనపథకం భారంగా మారింది.



- పెంచింది 31 పైసలు..భారం రూపాయి
- కుకింగ్ ఏజెన్సీలపై భారం
- బహిరంగ మార్కెట్లో మండిపోతున్న ధరలు
- అష్టకష్టాలతో విద్యార్థులకు భోజనం
- కార్మికులకు సకాలంలో అందని వేతనాలు
- డబ్బుల కోసం ఎదురుచూపు

సింగరాయకొండ: జిల్లా వ్యాప్తంగా 2326 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 1,73,314 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించింది. ఎప్పటికప్పుడు మెనూలో మార్పులు తీసుకొచ్చి బలవర్ధక ఆహారాన్ని ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో రుచి తగ్గిపోయింది.

మెనూ ప్రకారం ఆహారం అందడంలేదు. ఈ పథకానికి ప్రభుత్వం డొక్కాసీతమ్మ భోజన పథకంగా మార్చింది. పేరు మార్పుపై ఉన్న శ్రద్ధ విద్యార్థులకు పెట్టే భోజనంపై చూపెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి ఇచ్చే నగదును పెంచింది. గత ప్రభుత్వం ఒక విద్యార్థికి రూ.5.88 పైసలు ఇచ్చేది. కూటమి ప్రభుత్వం దానిని రూ.6.19 పైసలకు పెంచింది. ఈ ప్రకారం 31 పైసలు అదనంగా పెంచిందన్న మాట. అరకొరగా పెంచిందే కాక ఒక కూర అదనంగా ఇవ్వాలని పేర్కొంది. ప్రస్తుతమున్న రేట్ల ప్రకారం కూర వండాలంటే ఒక్కో విద్యార్థికి ఒక రూపాయి ఖర్చవుతుంది. అంటే 69 పైసలు అదనపు భారం ఏజెన్సీలపై పడుతోంది. బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు ఒక్క టమోటా తప్ప మిగిలినవన్నీ కేజీ రూ.40 పైనే ఉన్నాయి. కందిపప్పు కేజీ రూ.200, చింతపండు కేజీ రూ.200 ఉన్నాయని కుకింగ్ ఏజెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రకారం 31 పైసలు పెంచి రూపాయి విలువైన కూర పెట్టమంటే ఎలా పెట్టాలని కుకింగ్ ఏజెంట్లు వాపోతున్నారు. పెంచిన 31 పైసలు 2024 అక్టోబర్ నెల నుంచి ఇస్తామని చెప్పిందని, పాత డబ్బులే ఇస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పాత మెనూ ప్రకారం శనివారం ఆకు కూరలతో తయారు చేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగలి, రాగిజావ ఇవ్వాల్సి ఉండగా ఈరోజు నుంచి డొక్కా సీతమ్మ భోజన పథకంలో నూతన మెనూ ప్రకారం అన్నం, సాంబారు, వెజ్‌కర్రీ, చక్కెర పొంగలి, రాగిజావ విద్యార్థులకు పెట్టాల్సి ఉంది.



బింగినపల్లి ఎస్టీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం

సకాలంలో అందని వేతనాలు

జిల్లాలో మొత్తం 2,326 ఏజెన్సీలు ఉన్నాయి. వంట కార్మికులు, సహాయకులను కలుపుకొని 4,276 మంది పనులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకులందరికీ కష్టాలు మొదలయ్యాయి. అరకొర వేతనాలతో బతుకు బండిని లాగుతున్న వారిపై అధికార పార్టీ నేతలు వేధింపులకు దిగారు. పాత వారిని తొలగించి తమ పార్టీ సానుభూతిపరులను పనుల్లో పెట్టేందుకు కుట్రలు పన్నారు. చాలా మందిని మార్చేశారు. ఇది అలా ఉంచితే ఏజెన్సీలకు ప్రభుత్వం కుకింగ్ డబ్బులు మాత్రమే చెల్లిస్తోంది. కార్మికులకు ఇచ్చే నెల జీతం రూ.3 వేలు మాత్రం సకాలంలో ఇవ్వడంలేదు. గత ఏడాది అక్టోబర్ నెల వరకూ మాత్రమే చెల్లించింది. అది కూడా రూ.2 వేలే ఇచ్చింది. ఇంకా వెయ్యి రూపాయలు ఇవ్వలేదు. ఇలా అయితే తాము విద్యార్థులకు ఎలా భోజనం పెట్టాలని నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే మొత్తాన్ని పెంచాలని కుకింగ్ ఏజెంట్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

తలకు మించిన భారమే



25 ఏళ్లుగా కుకింగ్ ఏజెంటుగా ఉండి పిల్లలకు రుచిగా భోజనం వండి పెడుతున్నాను. ప్రస్తుతం ఇస్తున్న దానికి 31 పైసలు పెంచారు. కానీ పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలతో అదనంగా ఒక కూర వండి పెట్టాలంటే ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు డబ్బులకు తలకు మించిన భారమే. నాకు రావాల్సిన జీతం డబ్బులు కూడా విడతల వారీగా ఇస్తున్నారు. ఇలాగైతే ఎట్లా బతికేది. నాకు కుకింగ్ ఏజెన్సీనే జీవనాధారం.

– పోట్లూరి వెంకమ్మ, ఎస్టీ ప్రాథమిక పాఠశాల, బింగినపల్లి

హైందవ శంఖారావానికి ట్రాఫిక్ మళ్లింపు

ఒంగోలు టౌన్: కృష్ణా జిల్లా కేసరపల్లి గ్రామంలో ఆదివారం జరిగే హైందవ శంఖారావం సందర్భంగా ట్రాఫిక్ మళ్లించనున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలను దారి మళ్లించనున్నట్లు తెలిపారు. కాకినాడ జిల్లా కత్తిపూడి సెంటర్ నుంచి కాకినాడ, యానాం, అమలాపురం, రాజోలు, నరసాపురం, మచిలీపట్నం, రేపల్లె, బాపట్ల మీదుగా ఒంగోలుకు మళ్లించనున్నట్లు తెలిపారు. చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను త్రోవగుంట, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, మచిలీపట్నం, స్ట్రాంగ్ బ్రిడ్జి, నరసాపురం, అమలాపురం, కాకినాడ, కత్తిపూడి మీదుగా విశాఖపట్నానికి మళ్లించనట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

6న కలెక్టర్ గ్రీవెన్స్ రద్దు

ఒంగోలు వన్‌టౌన్: ఈ నెల 6న ఒంగోలు కలెక్టరేట్‌లో జరగాల్సిన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాజీవ్ రంజన్ మిశ్రా వన్‌మాన్ కమిషన్ పర్యటన జిల్లాలో ఉన్నందున, సోమవారం పీజీఆర్ఎస్ హాలులో దళితుల నుంచి అర్జీలు స్వీకరించే కార్యక్రమం నేపథ్యంలో గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

6 నుంచి జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు

ఒంగోలు సిటీ: ఏపీ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు మైనంపాడు డైట్ కళాశాలలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 8 అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. రోల్‌ప్లే, ఏక్‌భారత్–శ్రేష్ట భారత్ పై స్లోగన్ల తయారీ, జాతీయ సమైక్యతపై డిజిటల్ పోస్టర్ తయారీ, ఆంధ్రప్రదేశ్ జానపద నృత్యాలు, చేతిరాత పోటీలు, రంగోలి పోటీలు, భారత జాతీయ నాయకుల చిత్రపటాలు గీయడం, ఏపీ చరిత్ర, సంస్కృతి, భూగోళశాస్త్రం పై క్విజ్ పోటీలు (ఆరుగురు సభ్యులు) నిర్వహిస్తారు. ఆయా అంశాలకు సంబంధించి జరిగే పోటీల్లో అన్ని ప్రభుత్వ, కేంద్రీయ పాఠశాలలు, ప్రైవేట్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థినీ, విద్యార్థులు అర్హులన్నారు. ఒక విద్యార్థి ఒక పోటీలోనే పాల్గొనాలన్నారు. వివరాలకు 95020 43307 ను సంప్రదించాలని కోరారు.

సగానికి సగం మందే...

- మహిళా పోలీసు నియామకాలకు 455 మందికి గాను 221 మంది హాజరు
- హాజరైనవారిలో 114 మందే క్వాలిఫై
- ఉత్సాహంగా కొనసాగుతున్న పోలీసు ఉద్యోగాల దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పోటీలను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు ఉద్యోగాల నియమకాలకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలు ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. 5వ రోజు శనివారం మహిళా పోలీసు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగింది. 455 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 221 మంది మాత్రమే హాజరయ్యారు. వారిలో 114 మంది క్వాలిఫై అవడంతో వారు తదుపరి రాత పరీక్షలకు అర్హత సాధించారు. అంటే సగం మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో సగం మంది ఎంపిక కావడం గమనార్హం. ఒకవైపు చలి వణికిస్తున్నా లెక్క చేయకుండా ఉదయం 5 గంటలకు మహిళా అభ్యర్థులు జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్ వద్దకు చేరుకున్నారు. అడ్మిట్ కార్డుతో లోపలకు ప్రవేశించిన తరువాత సర్టిఫికెట్లు పరిశీలించారు. ఎత్తు, ఛాతీ కొలతలు తీసుకున్న తరువాత 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. తదుపరి అభ్యర్థుల వివరాలను ఆర్ఎఫ్ఐడీ కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు. అభ్యర్థులకు మంచినీటి సౌకర్యంతోపాటు ముందస్తు జాగ్రత చర్యల్లో భాగంగా వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు.

డబ్బులకు ఉద్యోగాలు రావు: ఎస్పీ ఏఆర్ దామోదర్

ఎవరైనా డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తానని చెబితే నమ్మవద్దని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. డబ్బులు ఇస్తే ఉద్యోగాలు రావని, ప్రతిభ ఉంటేనే ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని స్పష్టం చేశారు. పోలీసు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ మొత్తంలో ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కానీ, అక్రమాలకు కానీ తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. కాని స్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వారి ఆరోగ్య స్థితిగతులను ఆధారం చేసుకొని మాత్రమే హాజరుకావాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలని చెప్పారు. ఈ ఈవెంట్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, పీటీసీ డీఎస్పీ మాధవ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పీటీసీ డీఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీవో ఏఓ రామ్మోహనరావు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఆర్ఐలు, డీపీవో సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. పనులకు బిల్లులు వెంటనే చెల్లిస్తారన్నారు. ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, నియోజక వర్గాల్లో ఈ రోడ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు శ్రద్ధగా చేయాలన్నారు. ఈ పనులు చేపట్టడంలో ఎక్కడైనా రెవెన్యూ పరంగా సమస్యలు తలెత్తితే అక్కడి తహశీల్దార్లతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ జీ బ్రహ్మయ్య, ఈఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

గోవిందా..గోవిందా



● 516 కలశాలతో వేంకటేశ్వరస్వామి నగరోత్సవం

చీమకుర్తి: వేంకటేశ్వరస్వామి నగరోత్సవం సందర్భంగా శనివారం చీమకుర్తిలో భక్తుల గోవింద నామ స్మరణ మారుమోగింది. గోవింద మాల ధరించిన భక్తులు, మహిళలు 516 కలశాలతో ఇసుకవాగులోని శ్రీకృష్ణ మందిరం నుంచి ఊరేగింపుగా హరిహరక్షేత్రంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి సన్నిధి వరకు నగరోత్సవం నిర్వహించారు. శ్రీవారి కీర్తనలు పాడుకుంటూ స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగించుకుంటూ భక్తులు వచ్చారు. మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు, లక్ష్మీ పద్మావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, చలువాది బదరీనారాయణ, నూనె సుబ్రహ్మణ్యంతో పాటు స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.



కలశాలతో హరిహర క్షేత్రం వద్దకు వస్తున్న గోవింద స్వామి భక్తులు, మహిళలు

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత



మంచినీటి ప్లాంట్‌ను ప్రారంభించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

● ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయం ఆవరణలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసులు ఆరోగ్య రక్షణకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మంచి ఆహారంతో పాటు పరిశుభ్రమైన మంచినీరు తాగడం చాలా అవసరమన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంత నిధులతో ఈ ప్లాంట్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే జనార్దన్‌కు ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛమైన నీటిని సిబ్బందికి అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ , అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, తాలూకా సీఐ అజయ్ కుమార్, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం.. ఊరంతా సంబరం



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రాఘవేంద్ర శర్మ, గ్రామ మహిళలు



వేడుకకు హాజరైన మహిళలు

కొండపి: ఇంటి ఆడపడుచుకే కాదు.. పవిత్రంగా చూసుకునే గోమాతకూ సీమంతం వేడుకగా చేశారా గ్రామస్తులు. కొండపి మండలం కే ఉప్పలపాడు శివాలయానికి ఓ వ్యక్తి గోవును దానంగా ఇచ్చాడు. దాని బాధ్యతను గ్రామంలోని మహిళలు చూసుకుంటున్నారు. ఈక్రమంలో ఆవు చూడికి రావడంతో తమ ఇంటి బిడ్డలా చూసుకుంటున్న దానికి సీమంతం చేయాలని తలచారు. గ్రామంలోని మహిళలు తలాకొంత డబ్బులు సమకూర్చుకుని శుక్రవారం రాత్రి సీమంతం వేడుక నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా ఈ వేడుకలో పాల్గొన్నారు. గోవుల రక్షణతో పాటు పశుసంపద, ప్రజలంతా బాగుండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు రాఘవేంద్ర శర్మ తెలిపారు. వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పసుపు, కుంకుమ, మిఠాయిలు పంచిపెట్టామన్నారు. సీమంతం నిర్వహించిన ఆవుకు శనివారం దూడ పుట్టడంతో మహిళలు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ప్రజల సమస్యలపై జవాబుదారీతనంగా వ్యవహరించాలి
- సమస్యల పరిష్కారానికే సదస్సులు
- జిల్లాలో ఇప్పటికే 14 వేల దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ అన్సారియా

కనిగిరి రూరల్: భూ సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. మండలంలోని పునుగోడులోని కాంచీపురం గ్రామ రెవెన్యూ సదస్సులో శనివారం స్థానిక ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు, రైతులకు జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణపై జాప్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవన్నారు, స్థానిక గ్రామ రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై అసంతృప్తి వ్యక్తంచేశారు. సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లాలో ఇప్పటికి 14వేల దరఖాస్తులు

డిసెంబర్ 6 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ భూ ఇతర సమస్యలపై 14 వేల అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం విస్తీరణంలో లోపాలు ఉన్నట్లు అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సీడీపీఓ సరోజినీ ఆధ్వర్యంలో ఏడుగురు గర్భిణులకు కలెక్టర్ చేతుల మీదుగా సీమంతం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్ చింతల పూడి అశోక్ కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ హనుమంతరావు, రెవెన్యూ, అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీమా పేరుతో టీడీపీ సభ్యత్వాలా..?

- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలని హితవు



ప్రోటోకాల్ పాటించాలని ఎంఈఓను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు

పొన్నలూరు: గ్రామాల్లో టీడీపీ నాయకులు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బందిని అడ్డుపెట్టుకొని బీమా పేరుతో ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలు దగ్గర వంద రూపాయిలు వసూలు చేసి టీడీపీ సభ్యత్వాలు చేస్తున్నారని ఆశాఖ అధికారులను జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు నిలదీశారు. పొన్నలూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలు దగ్గర వంద రూపాయిలు చొప్పున డబ్బులు వసూలు చేసి బీమా పేరుతో టీడీపీ సభ్యత్వాలు చేయడం దారుణమన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకోకపోతే ప్రభుత్వ పథకాలు అందకుండా చేస్తామని కొందరు టీడీపీ సానుభూతిపరులు గ్రూపుగా ఏర్పడి ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలు దగ్గర డబ్బులు వసూలు చేసి బలవంతంగా టీడీపీ సభ్యత్వాలు చేయిస్తున్నారన్నారు. అలాగే దీనికి కొందరు కింది స్థాయి ఉద్యోగస్తులు సహకరిస్తున్నారని, ఇది ఏమాత్రం మంచిది కాదని దీనిపై ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పెదవెంకన్నపాలెంలో వాగు పోరంబోకు భూముల్లో గోకులం షెడ్ నిర్మాణానికి ఎలా అనుమతులు ఇస్తారని జెడ్పీటీసీ ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాల్లో, జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులను పిలవకుండా ప్రోటోకాల్ పాటించలేదని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. వెలుగు ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నగదుతో డ్వాక్రా మహిళలకు 50 శాతం రాయితీతో లక్ష రూపాయిలతో గొర్రెలు మంజూరు చేశారని, అయితే చెప్పిన ప్రకారం మరణించిన గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించకుండా మహిళలను తిరిగి రూ.లక్ష చెల్లించమని చెప్పడం సమంజసం కాదని వెలుగు అధికారులను ఎంపీపీ మాధవరావు నిలదీశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహార వస్తువులు, గుడ్లు అందించడం లేదని కె. అగ్రహారం సర్పంచ్ చినమస్తాన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. మొత్తం అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేశ్వర రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

- విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్యే కీలకం
- కలెక్టర్ అన్సారియా



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరిరూరల్: విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్యే అత్యంత కీలకం.. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకుని.. లక్ష్య సాధన దిశగా ముందడుగు వేసి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు విద్య ఆవశ్యకత, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. విద్యార్థులు డ్రగ్స్, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం.

కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్..విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేశారు. తొలుత విద్యార్థులతో మాట్లాడి వివిధ సమస్యలపై, అంశాలపై చర్చించారు.కళాశాలల్లో జరుగుతున్న విద్యాబోధన, విద్యార్థుల్లో విద్యా ప్రవీణ్యత, నాణ్యతా ప్రమాణాలను తెలుసుకున్నారు. తనంతరం కళాశాల ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు.

ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించారు. మదర్ కేర్ విభాగాన్ని పరిశీలించారు. అనంతరం పలు సేవాహిత కార్యక్రమాలను కలెక్టర్ ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్, ఎండీఓ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెళ్లి వేడుకలకు వెళ్లొస్తూ..!

- ఆటో బోల్తా పడి ఒకరు మృతి.. 9 మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమం



మృతి చెందిన పండు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు



చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్

కంభం: పెళ్లి వేడుకలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో 9 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తురిమెళ్ల-యర్రబాలెం గ్రామాల మధ్యలో శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..బేస్తవారిపేట మండలం కొత్తపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం ఓ వివాహం జరిగ్గా..శనివారం మరుల పెళ్లి వేడుకలు రాచర్ల మండలం అనుమలవీడులో జరిగాయి. కొత్తపేట నుంచి శనివారం ఉదయం రెండు ఆటోల్లో అనుమలవీడుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆటో తురిమెళ్ల దాటిన తరువాత యర్రబాలెం సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న వారంతా ఒకరిపై ఒకరు కిందపడి గాయపడ్డారు. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పండు(28)మృతి చెందగా డ్రైవర్ కాశీ, బాబు, దినేష్, వి.అఖిల్, ఎం అఖిల్, ఈశ్వర్, నిర్మల్, సందీప్, ప్రవీణ్, యోబుకు కాళ్లకు, నడుము, ఇతర చోట్ల గాయాలయ్యాయి. వీరిలో యోబుకు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం మార్కాపురం వైద్యశాలకు తరలించారు. మృతుడితో పాటు గాయాలపాలైన యువకులంతా వరుసకు బంధువులు కావడంతో ఆ కుటుంబాల్లో విషాదం నెలకొంది.

సూపర్ సిక్స్ ఎప్పుడు అమలు చేస్తారు?

ఒంగోలు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసి మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు శ్రీనివాస కుమారి ప్రశ్నించారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నాయని, దీపం పథకం తప్ప మరే పథకాన్ని ప్రారంభించలేదని చెప్పారు.

అమ్మకు వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరానికి వాయిదా వేయడం అన్యాయమన్నారు. 18 నుంచి 56 ఏళ్ల వయసు కలిగిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారని కానీ ఇంత వరకు ఆ ఊసే లేదన్నారు. జీవి కొండారెడ్డి, కంకణాల రమాదేవి, నాగూర్‌బి, ఆదిలక్ష్మి, బషీరా, ఖాదరున్నిసా, భానుమతి, రత్న, శాంత, షమిలా పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణంలో ఉద్రిక్తత



రోడ్డు పనుల వద్ద గుడిగూడిన గ్రామస్తులు

- అధికారుల తీరుపై స్థానికుల అభ్యంతరం

తర్లుపాడు: మండలంలోని పోతలపాడులో సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో శనివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇంటిపట్టా భూముల్లో రోడ్డు నిర్మాణం చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రెండు వర్గాలుగా విడిపోయిన ప్రజలు పెద్దఎత్తున గ్రామంలో గుమికూడటంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఎస్సై బ్రహ్మనాయుడు సిబ్బందితో పోతలపాడు చేరుకున్నారు. బాధితుల పక్షాన సర్పంచ్ శ్రీనివాసరెడ్డి అధికారులను ప్రశ్నించడంతో వారు సమాధానం దాటవేశారు. కాగా పూర్వం నుంచి అక్కడ కాలిబాటమాత్రమే ఉందని, తమను ఇబ్బంది పెట్టేందుకు రాజకీయ కారణాలతో అధికార పార్టీలోని కొందరికి మేలు చేసేందుకే రోడ్డు నిర్మిస్తున్నారని బాధితులు వాపోయారు.

దివ్యాంగుల చట్టం పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు వన్‌టౌన్: జాతీయ దివ్యాంగుల చట్టం 2016 వాల్‌పోస్టర్‌ను జేసీ ఆర్ గోపాలకృష్ణ ఆవిష్కరించారు. ఒంగోలు కలెక్టరేట్‌లో లుయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమం అనంతరం తనను కలిసిన విభిన్న ప్రతిభావంతులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జి.అర్చన, దివ్యాంగుల సంఘం నాయకులు ఎం సులోచన రాణి, ఎస్‌కే కాలేషా, ఉలిచి కోటేశ్వర రావు, సయ్యద్ ఆమీర్ హంజా, పసుమర్తి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

ఒంగోలు సిటీ: అఖిల భారత యువజన సమాఖ్య 74వ వార్షికోత్సవం సందర్భంగా ఒంగోలు మండలం కరవదిలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు నాకౌట్ కం లీగ్ పద్ధతిలో జరుగుతాయన్నారు. ప్రవేశ రుసుం రూ.150 చెల్లించాలన్నారు. పోటీల్లో తుది నిర్ణయం కమిటీ దేనని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.8 వేలు, మూడో బహుమతి రూ.6 వేలు, నాల్గవ బహుమతి రూ.4 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 8919553088, 9441859578 నంబర్లను సంప్రదించాలని కోరారు.